క్లుప్తంగా

నేటి నుంచి 'కృష్ణవేణి సంగీత నీరాజనం'

నగరంలోని మూడు ప్రాంతాల్లో 3 వేదికలపై

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశ చరిత్ర, సంస్కృతి, కళలు ప్రతిబింబించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యాటక, సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు 'కృష్ణవేణి సంగీత నీరాజనం' కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న 35 ప్రదర్శనల్లో 140 మంది ప్రతిబావంతులైన కళాకారులు పాల్గొననున్నారు. ఈ ఉత్సవాల తొలి ప్రధాన వేదికగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియంను నిర్ణయించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. రెండవ వేదిక అయిన ఇంద్రకీలాద్రి దిగువన ఉన్న దుర్గాఘాట్‌లో 7వ తేదీ ఉదయం 8.30 గంటలకు త్యాగరాజ పంచరత్న కృతులు ప్రదర్శిస్తారు. మూడవ వేదికయిన శ్రీదుర్గామల్లేశ్వస్వామివార్ల దేవస్థానంలో 8వ తేదీ ఉదయం 8.30 గంటలకు దేవీ కృతులు ఉంటాయి.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారికి గురువారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని స్వామి వారికి ఆలయ అర్చకులు అభిషేకాలు, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ప్రతి గురువారం స్వామి వారికి విశేష అభిషేకాలతో పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు.

నేటి నుంచి విజయ్ మర్చంట్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు

విజయవాడస్పోర్ట్స్: బీసీసీఐ దేశవాళీ టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీ గ్రూఫ్-డి క్రికెట్ మ్యాచ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్‌బాబు వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ మ్యాచ్‌ల కోసం మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియం, మూలపాడులోని డీవీఆర్, సీపీ మైదానాలను సిద్ధం చేశామన్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్ణాటక-విదర్భ, రాజస్థాన్-ఝార్ఖండ్, అస్సాం-ఉత్తరాఖండ్, 11 నుంచి 13 వరకు రాజస్థాన్-ఉత్తరాఖండ్, ఝార్ఖండ్-కర్ణాటక, జమ్మూ కశ్మీర్-విదర్భ, 17 నుంచి 19 వరకు రాజస్థాన్-విదర్భ, జమ్మూ కశ్మీర్-కర్ణాటక, ఝార్ఖండ్-ఉత్తరాఖండ్, 22 నుంచి 24 వరకు కర్ణాటక-ఉత్తరాఖండ్, రాజస్థాన్-జమ్మూ కశ్మీర్, ఝార్ఖండ్-విదర్భ, 28 నుంచి 30 వరకు జమ్మూకశ్మీర్-ఝార్ఖండ్, ఉత్తరాఖండ్-విదర్భ, రాజస్థాన్-కర్ణాటక జట్లు తలపడతాయన్నారు.

పాతశివాలయం హుండీ ఆదాయం రూ.3.84 లక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో భక్తులు సమర్పించిన కానుకల హుండీల ద్వారా స్వామి వారికి రూ.3,84,650 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయంలో హుండీలను గురువారం లెక్కించారు. ఆలయంలోని 27 హుండీలు, నాలుగు తాత్కాలిక హుండీల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే గుంటూరు సీతారావమ్మ అన్నసత్రం కార్యనిర్వహణాధికారి అరుణ దేవదాయ శాఖ పక్షాన పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ ఐదో తేదీ వరకూ 44 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయంగా అధికారులు పేర్కొన్నారు. హుండీల లెక్కింపులో ఆలయ కమిటీ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వీఎంసీ కార్మికులకు వైద్య పరీక్షలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలో ఆయా విభాగాల్లో విధులు నిర్వహించే కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు తాము నిరంతరం శ్రమిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు తెలిపారు. యూనియన్, ఈఎస్ఐ సంయుక్త ఆధ్వర్యంలో వీఎంసీలోని ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, ఉద్యాన వన విభాగంలో విధులు నిర్వహించే కార్మికులకు ఆయన నగరంలోని రాజీవ్‌నగర్‌లోని ఓల్డేజ్ హోమ్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు కళ్లు, బీపీ, షుగర్, శ్వాస, గుండె, కిడ్నీ, లివర్ తదితర ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రతి నెలా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందిస్తామన్నారు. సాంబశివరావు, సూర్యనారాయణ, విజయ్‌కుమార్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



అమృత్ పార్క్ ఎంట్రన్స్‌లో దెబ్బతిన్న పేపర్‌బ్లాక్స్



గేట్లకు తాళాలు దెబ్బతినడంతో కట్టెలు సపోర్ట్ పెట్టిన దృశ్యం

అధ్వానంగా అమృత్ పార్క్

- అడుగుపెట్టాలంటే అవస్థలే
- శిథిలమైన దారి
- అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అమృత్ ఉద్యానవనంలో అడుగు పెట్టాలంటే అవస్థలు పడాల్సిందే. పార్క్ ఎంట్రన్స్ గేటు వద్ద ఏర్పాటు చేసిన పేపర్స్ బ్లాక్స్ కదిలిపోయాయి. కొన్ని పగిలిపోవడం, మరికొన్ని కుంగిపోవడంతో దారి నడవడానికి వీల్లేకుండా అస్తవ్యస్తంగా మారింది. పేపర్ బ్లాక్స్‌పైకి లేచి కాళ్లకు తగులుతున్నాయి. దీంతో పార్క్‌లో వాకింగ్‌కు వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికి తోడు పార్క్ నిర్వహణ అధ్వానంగా తయారైంది. భవానీపురం –గొల్లపూడి బైపాస్ రోడ్డు మార్జిన్ వెంబడి అమృత్ పేరుతో 2017 లో పార్క్ నిర్మించారు. చర్చి సెంటర్ నుంచి ఓల్డ్ హెబీ వెంకటేశ్వర ఫాండ్రీ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు పార్కు నిర్మించారు. కనెక్టింగ్ రోడ్ల వద్ద వదిలేసి మిగిలిన చోట్ల మార్జిన్ పొడవునా పార్కును ఏర్పాటు చేశారు. చెట్లు పూల మొక్కలు వేశారు. సేదతీరేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేశారు. పశువులు వెళ్లకుండా పార్క్‌కు రెండు వైపులా ఇనుప కంచె అమర్చారు. సమీప ఆవాసాల వారు వాకింగ్ చేసేందుకు వీలుగా పార్క్‌లో కొంత భాగం వదిలివేశారు. ఉదయం సాయంత్రం స్థానికులు ఆ పార్క్‌లో వాకింగ్ చేస్తున్నారు. పార్క్ ఎంట్రన్స్‌లో డస్ట్ లేకుండా పేపర్ బ్లాక్స్ ఏర్పాటు చేశారు. ప్రధాన గేటు వద్ద మ్యాన్ హోల్ ఉండడంతో అక్కడ పేపర్ బ్లాక్స్ దెబ్బతిన్నాయి. పూర్తిగా పైకి లేచి పార్క్ ఎంట్రన్స్‌లో దారి అస్తవ్యస్తంగా తయారైంది. దారి పూర్తిగా దెబ్బతింది. ఎంట్రన్స్‌లోనే పరిస్థితి అలా ఉండడంతో పార్క్‌లో అడుగు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. యథాలాపంగా పార్క్‌లోకి ప్రవేశిస్తే రాళ్ల కాళ్లకు తగిలిపడిపోయే ప్రమాదం ఉంది. దారి మధ్యలో మ్యాన్‌హోల్ ఉండడంతో ఇబ్బందిగా మారింది. లేచిన పేపర్స్ బ్లాక్స్ మధ్యలో కాళ్లుపడి దెబ్బలు తగులుతున్నాయి. పార్క్ ఎంట్రన్స్‌కు ఇరువైపులా షాపులు ఏర్పాటు చేయడంతో రద్దీ సమయంలో దారి మూసినట్లు ఉంటుంది. పార్క్‌లో వాకింగ్ ట్రాక్‌పై రాళ్లు పైకి తేలి, ఎగుడు దిగుడుగా ఉన్నాయి. వాకర్స్‌కు సరైన ట్రాక్‌లు లేక ఇబ్బందులు ఉంటే ఉన్న వాటి నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆహ్లాదం మాటెలా ఉన్నా కనీసం సౌకర్యాలు మెరుగు పరచాలని వాకర్స్ కోరుతున్నారు.

కంచెకు రక్షణలేదు.....

పార్క్‌కు రెండు వైపులా ఏర్పాటు చేసిన కంచె అపహరణకు గురవుతోంది. సాక్షాత్తూ పోలీసు స్టేషన్ ఎదురుగా పార్క్‌కు ఏర్పాటు చేసిన కంచెను పూర్తిగా తొలగించారు. గేట్లు ఉన్నప్పటికీ వాటి తాళాలు పగులగొట్టారు. దీంతో కంచెతో ఏర్పాటు చేసిన గేట్లు విడిపోయి విరిగిపోతున్నాయి. వీటిని సిబ్బంది కట్టెల ఆధారంతో కట్టి ఉంచారు. దాదాపు గేట్లు అన్ని ధ్వంసమయ్యాయి. మెయిన్ రోడ్డు మార్జిన్‌లో పార్క్ కంచెకు అనుకుని వ్యాపారాలు చేసేవారు వ్యర్థాలు పార్క్‌లో వేస్తున్నారు. దీంతో చెత్తా చెదారం పెరిగిపోయింది. కంచెకు రక్షణ, పార్క్‌లో పరిశుభ్రత, వాకింగ్ ట్రాక్ మొత్తం మట్టితో చదును చేయాలని స్థానికులు కోరుతున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన పార్క్‌ల అభివృద్ధి పరిచేందుకు అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం

వీఆర్ సిద్దార్థ (డీమ్డ్ టు బి) వీసీ వెంకటేశ్వర్లు



ఆలిండియా ఇన్విటేషన్ మహిళల వాలీబాల్ టోర్నీ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. కాలేజీ ఆవరణలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే నాదెళ్ల బసవపూర్ణయ్య (ఎన్‌బీపీ) ఆలిండియా ఇన్విటేషన్ మహిళల వాలీబాల్ టోర్నీకి సంబంధించిన ట్రోఫీలను కాలేజీలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అధునాతన స్టేడియంలో ప్రప్రథమంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 12వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా ఆలిండియా వాలీబాల్ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పోటీలకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. స్టేడియంలోని ఆరు కోర్టుల్లో 14 క్రీడాంశాల పోటీలను నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు కాలేజీలో సముచిత స్థానం కల్పిస్తామని వెల్లడించారు. ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ నాదేళ్ల బ్రహ్మాజీ మాట్లాడుతూ సెంట్రల్ రైల్వేస్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, ఐసీఎఫ్(చెన్నైయ్), సౌత్ సెంట్రల్ రైల్వేస్, సదరన్ రైల్వేస్ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. దేశ వ్యాప్తంగా టాప్ ప్లేస్‌లో ఉన్న 80 శాతం వాలీబాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఆర్‌వీఆర్ ఓటీటీ (హైదరాబాద్), సింహాద్రి టీఎంటీ స్టీల్, జీఆర్‌జీ ట్రస్ట్(కోయంబత్తూర్), ఆంధ్రా ఆసుపత్రి, హెల్ప్ ఆసుపత్రి ఈ పోటీలకు స్పాన్సర్‌లుగా వ్యవహిస్తున్నారని చెప్పారు. విజేతలకు రూ.2.75 లక్షల నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రో వైస్ చాన్స్‌లర్ ఎ.వి.రత్నప్రసాద్, డైరక్టర్ పాండురంగారావు, కృష్ణా జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి దోనేపూడి దయాకరరావు, ఎన్‌బీపీ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ దేవేంద్రరాజా పాల్గొన్నారు.

నేటి నుంచి కోస్తాంధ్రలో ప్రచార రథం పర్యటన



ప్రచార రథానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో రత్నరాజు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ప్రచార రథం గోదావరి జిల్లాలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆలయ డీఈవో రత్నరాజు తెలిపారు. దుర్గగుడి కనకదుర్గనగర్‌లో గురువారం రాత్రి ప్రచార రథానికి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ప్రచార రథంపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు పూజలు నిర్వహించగా, రథానికి ఆలయ వైదిక కమిటీ సభ్యులు ఆర్. శ్రీనివాసశాస్త్రి కొబ్బరి కాయ కొట్టారు. 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తణుకు, మడికి, సిద్ధాంతం, జగ్గంపేట, యర్రవరం, ఏలేశ్వరంచ, లక్ష్మీపురం, కిమ్మూరు, గొంటివాని పాలెం, జె. అన్నవరం, పులుగోగులపాడు, మంగంపాడు, మారేడుబాక, రత్నాలపేట సెంటర్, బలిజపాడు, వంచంగి, జి.కొత్తపల్లి, కరుదేవపాలెం, దుర్గానగర్, చికిలింత, వణకరాయి. జర్ధంగి, దూసరపాము, కెడి. పేట, పెద్దవలస, అంతర్ల, లోతుగడ్డ జంక్షన్, చింతపల్లి, పెదజడమూరు, జి. మాడుగుల, పాడేరు. పెదకొండమ్మ ఆలయం, అరకువ్యాలీ, నెలిమర్ల, రామతీర్థం, సతివాడలలో ప్రచారం నిర్వహిస్తుంది.

శానిటేషన్ మస్టర్ మాయాజాలం

- ఆధార్ లేకుండా మస్టర్ ఎలా వేశారు?
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కయిన అధికారులు
- బ్లాక్ లిస్ట్‌లోని కాంట్రాక్టర్ మళ్లీ రంగంలోకి
- వీఎంసీ ఆదాయానికి భారీ గండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల జరిగిన దసరా ఉత్సవాల్లో భాగంగా శానిటేషన్ పనుల్లో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగింది. ఇద్దరు మహిళా కాంట్రాక్టర్ల మస్టర్ల మాయాజాలం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారిద్దరి వెనుక నగరపాలక సంస్థ అధికారుల అండదండలు ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అనుగ్రహం ఉంటే ఏదైనా సాధ్యమేనని ఇద్దరు మహిళా కాంట్రాక్టర్లు నిరూపించారు. దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రి దిగువన ఘాట్లలో భవానీల దుస్తుల ఏరివేత, శానిటేషన్ పనుల నిమిత్తం నగరపాలక సంస్థ ఆన్‌లైన్ టెండర్‌ను ఇద్దరు మహిళా కాంట్రాక్టర్‌లు దక్కించుకున్నారు. ఉత్సవాల 12 రోజులకుగాను ఒక్కొక్కరికి రూ.500 చెల్లించేలా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు షిఫ్టులకుగాను ఒక్కో షిఫ్టుకు 300 మంది చొప్పున మొత్తం 900 మందిని నియమించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరికీ ఐరిష్ తీసి, వారి ఆధార్ కార్డ్ నంబర్‌తో రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే ఆ మహిళా కాంట్రాక్టర్లు కేవలం 600 మందిని మాత్రమే నియమించుకున్నారు. మిగిలిన 300 మంది లేకుండానే రిజిస్టర్‌లో ఇష్టమొచ్చిన పేర్లు రాసేసుకున్నారు. రిజిస్టర్‌లను తనిఖీ చేస్తే సిబ్బంది పేర్లు తప్ప ఆధార్ నంబర్లు, సంతకాలు ఉండవు. వారు కూడా పని చేసినట్లు బిల్లు పెట్టుకున్నారు. వాటిపై దసరా ఉత్సవాల విధుల్లో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇన్‌చార్జ్ సీఎమ్‌హెచ్‌ఓ కూడా వాస్తవాలు తెలుసుకోకుండా సంతకాలు ఎలా చేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తం మీద ఆ ఇద్దరు మహిళా కాంట్రాక్టర్లు సుమారు రూ.20 లక్షలకు మున్సిపల్ కార్పొరేషన్‌కు టోపీ పెట్టారు. (ఉత్సవాల్లో 13వ రోజుకూడా పని చేసినట్లుగా). మరో విశేషమేమిటంటే ఆ ఇద్దరు కాంట్రాక్టర్లలో ఒకరిని మున్సిపల్ కార్పొరేషన్ గతంలోనే బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు సమాచారం. మళ్లీ ఆమెను కాంట్రాక్టర్ల జాబితాలు ఎప్పుడు..ఎలా చేర్చారో అధికారులకే తెలియాలి. మహిళా కాంట్రాక్టర్ల మస్టర్ల మాయాజాలంపై మున్సిపల్ కమిషనర్ విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అలరించిన భక్తి సంగీతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తెనాలికి చెందిన డాక్టర్ ఓ.రమేష్‌బాబు బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించారు. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై రమేష్‌బాబు బృందం పలు కీర్తనలు ఆలపించింది. రమేష్‌బాబుకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

'ఆకుల'ను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నేతలు



డాక్టర్ రాజ్‌కుమార్‌కు నివాళులర్పిస్తున్న రఘురాం, అప్పిరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పుత్ర శోకంతో తల్లడిల్లుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను వైఎస్సార్ సీపీ నేతలు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి గురువారం పరామర్శించారు. ఆకుల శ్రీనివాస్ కుమార్ చిన్న కుమారుడు డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో భవానీపురంలోని ఆకుల నివాసానికి వచ్చిన తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి తొలుత రాజ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ కుమార్‌ను పరామర్శించి ఓదార్చారు. సామాజిక సేవా దృక్పథం ఉన్న రాజ్‌కుమార్ అకాల మరణం తమను కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. భగవంతుడు రాజ్‌కుమార్ ఆత్మకు శాంతిని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

డ్రోన్లతో నేరస్తులపై నిరంతరం నిఘా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ ఏసీపీ స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో ఎస్ఎన్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి రైల్వేస్టేషన పరిసర ప్రాంతాలలో డ్రోన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ వై.బాలరాజాజీ, నున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్‌లతో రెండు బృందాలను ఏర్పాటు చేసి వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. క్లాక్ టవర్ వద్ద ఫాల్కాన్ వాహనం నుంచి ఏసీపీ డ్రోన్ విజువల్స్‌ను పర్యవేక్షిస్తూ అనుమానితుల వివరాలను సిబ్బందికి అందని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బొగ్గు లైన్ క్వార్టర్స్ వద్ద ముగ్గురు, మట్టిరోడ్డులో మరో ముగ్గురు బహిరంగంగా మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ స్రవంతిరాయ్ మాట్లాడుతూ నార్త్ డివిజన్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రతి రోజు డ్రోన్లతో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. బహిరంగ మద్యం సేవించేవారు, గంజాయి, మత్తు పదార్థాలను ఉపయోగించే వారితో పాటు శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తున్న వారిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సుస్వరాల సంగమం చిత్ర గీతాల గానం



విజయవాడకల్చరల్: రాగలహరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై గురువారం నిర్వహించిన చిత్ర గీతాల కార్యక్రమం మధురంగా సాగింది. గాయని మల్లాది స్వాతి పర్యవేక్షణలో, వడ్డాది సూర్య కామేశ్వరి, పరమేశ్వరి, షబానా, అయ్యప్పన్ సాయి కృష్ణ, డి.మోహన రాజు, రామాంజీ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి ఏపీఎల్ఏ అథారిటీ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో విజయాలు సాధించాలని సూచించారు. విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. సంస్థ వ్యవస్థాపక సభ్యుడు మీరాకుమార్ మాట్లాడుతూ.. విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తూ నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తోందన్నారు. విశ్రాంత ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్‌వీ ప్రసాదరావు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎల్ఎస్ఎం రమాశ్రీ చేతులమీదుగా సంస్థ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీరాకుమార్, చింతకాయల చిట్టిబాబు, బి.వీరభద్రరావు, ముష్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన చంటిబాబు



చంటిబాబును ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విద్యాధరపురానికి చెందిన ఎస్సీ నాయకుడు పొదిలి చంటిబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావుతో కలిసి తాడేపల్లిలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో కలిసి ఉన్న ఫొటోను చూపించగా.. చంటిబాబును జగన్ ఆప్యాయంగా పలకరించారు.

అత్యాధునిక ప్రమాణాలతో గుణదల స్టేషన్

ఏడీఆర్ఎం పీ.ఈ ఎడ్విన్



స్టేషన్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం ఎడ్విన్ తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అమృత్ భారత్ పథకంలో భాగంగా గుణదల రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక ప్రమాణాలతో అంతర్జాతీయస్థాయి సదుపాయాలతో పనులు వేగంగా జరుగుతున్నాయని విజయవాడ రైల్వే డివిజన్ ఏడీఆర్ఎం పీఈ ఎడ్విన్ తెలిపారు. గతిశక్తి డెప్యూటీ చీఫ్ ఇంజినీర్ పీవీ రమణారావుతో కలసి గుణదల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనుల గురించి గురువారం మీడియాకు వివరించారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీని తగ్గించే లక్ష్యంగా గుణదల రైల్వే స్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా విజయవాడ డివిజన్‌లో 22 స్టేషన్‌లు ఆధునికీకరణ పనులకు ఎంపిక కాగా అందులో గుణదల స్టేషన్ ఒకటి ఉందన్నారు. అమృత్ భారత్ పథకంలో మొదటి దశలో రూ. 35.5 కోట్లతో గుణదల రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులకు గతిశక్తి ప్రాజెక్టుకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టులో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విశాలవంతమైన స్టేషన్ భవన నిర్మాణం, మాడ్యులర్ టాయిలెట్‌లు, ప్లాట్‌ఫాంలు పొడిగింపు, వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫాం పైకప్పులపై సోలార్ ప్యానేల్స్ ఏర్పాటు, విశాలవంతమైన ఎఫ్ఓబీలు తదితర పనులు 25శాతం పనులు పూర్తిఅయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులు 2025 జూన్ నాటికి పూర్తిచేసే లక్ష్యంతో వేగవంతంగా పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గతిశక్తి డెప్యూటీ చీఫ్ ఇంజినీర్ పీవీ రమణారావు స్టేషన్‌లో జరుగుతున్న పనుల పురోగతిని వివరించారు. ముఖ్యంగా ప్రయాణికులు, దివ్యాంగులకు అధునిక మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంగా ప్లాట్‌ఫాంలకు చేరుకునేందుకు ర్యాంపు మార్గాలు, ప్రత్యేక టాయిలెట్‌ల నిర్మాణం, లిఫ్టులు, ఎస్కలేటర్లు తదితర ఏర్పాట్లు పనులు వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తయితే గుణదల రైల్వేస్టేషన్ శాటిలైట్ స్టేషన్‌గా విజయవాడ ప్రధాన స్టేషన్‌పై చాల వరకు భారం తగ్గించే వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గతిశక్తి డీఈఈ శ్రీనివాస్, విజయవాడ రైల్వే పీఆర్ఓ నుస్రత్‌మండ్రుప్కర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సాంకేతికత అవసరం




మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, పట్టాభిరామ్, అనిల్‌కుమార్‌రెడ్డి

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛతకు సాంకేతికతతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల వినియోగంతో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేలా వీఎంసీ చర్యలు తీసుకోవాలని స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ సూచించారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తో గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో స్వచ్ఛ విజయవాడపై సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు.

పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి వ్యర్థ నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డ్రోన్ల నిర్వహణను సమన్వయం పరుస్తూ డ్రోన్ సర్వేలైన్స్ ద్వారా ప్రస్తుతం ఉన్న సమస్యలను ఎలా తీర్చవచ్చు ఎలా తీర్చగలము లాంటి అంశాలపై చర్చించారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర నగరంలోని ఆయా డివిజన్లలోని గృహాలు, వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్న పలు సమస్యలను వివరించారు. దోమలు పెరగకుండా ఉండేందుకు, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించేందుకు, కుక్కలు, ఆవుల వివరాలు సేకరించేందుకు ఇతర అంశాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ సర్వేలైన్స్ వినియోగించాలన్నారు. సమావేశంలో స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ అధికారులు భాగ్యలక్ష్మి, దశరథ్ రామి రెడ్డి, స్వచ్ఛ ఆంధ్రా చీఫ్ ఇంజినీర్ శ్రీరామచంద్ర, వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇన్‌చార్జి(వెహికల్స్) ఏసుపాదం, బయాలజిస్ట్ సూర్య కుమార్, డ్రోన్ టీమ్ సభ్యులు, నియో స్పైక్ నిపుణులు శరత్చంద్ర, హను, పాల్గొన్నారు.

వైబ్రెన్స్ పోటీల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన వైబ్రెన్స్ పేరుతో వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు చెప్పారు. ఆ కళాశాల ప్రజ్ఞ విభాగం నిర్వహించనున్న పోటీల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం కాలేజీ కార్యాలయంలో జరిగింది. పోస్టర్ ఆవిష్కరించిన శ్రీనివాసు మాట్లాడుతూ శనివారం పోటీలు జరుగుతాయని, అదే రోజు సాయంత్రం జరిగే ముగింపు సభలో బహుమతులు అందజేస్తామన్నారు. వ్యాసరచన (ఇంగ్లిషు, తెలుగు), క్విజ్, వస్తృత్వం, వెస్టర్న్ గ్రూప్ డ్యాన్స్, యాడ్ ఎక్స్ ప్రెస్, స్టాండప్ కామెడీ, ఫ్లాష్ మాబ్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. కళాశాలలకు చెందిన డిగ్రీ చదివే విద్యార్థులందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కళాశాల కోశాధికారి హరగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ప్రజ్ఞ కన్వీనర్ బి.మోహన్‌తేజ పాల్గొన్నారు. నిరంతర శ్రమతోనే లక్ష్యసాధన సాధ్యమని కేబీఎన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్టూడెంట్ ఎక్సేంజ్ ప్రోగ్రాంలో ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల విద్యార్థులు కేబీఎన్ కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాలలోని అడ్వాన్స్‌డు కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీలను సందర్శించారు. కంప్యూటర్ రంగంలో ఆధునిక అంశాలైన మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ తదితర అంశాలను అధ్యాపకులు వారికి వివరించారు.